పెడన మున్సిపాలిటిక్స్

- చెత్తాంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా పెడన
- రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు
- పారిశుద్ధ్య నిర్వహణకు అధికారుల సహకారం ఏదీ
- కూటమి నేతల మాట అధికారులకు శిరోధార్యం!
- విసిగిపోతున్న పాలకవర్గ చైర్‌పర్సన్, సభ్యులు


పెడనలో శివాలయం ఎదురుగా మసీద్ పక్కన ఖాళీ స్థలంలో చెత్త నిల్వలు

పెడన: పెడన మున్సిపాలిటీలో 'పాలిటిక్స్' నడుస్తున్నాయి. పట్టణ వీధులు చెత్తగా మారుతున్నాయని పాలకవర్గం మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో రోడ్లు చెత్త చెత్తగా మారాయి. పట్టణంలో చెత్తను ఎత్తి పారిశుద్ధ్య సిబ్బందిని పరుగులు పెట్టించిన గత కమిషనర్ వెంట్రామయ్య బదిలీపై వెళ్లినప్పటి నుంచి పెడన 'చెత్తాంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్'గా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ ప్రధాన రహదారుల వెంట ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వీధుల్లో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది.

సహకారం సున్నా

పురప్రజలు పాలకులను ఎన్నుకున్నారు దీంతో వారు బాధ్యతగా అధికారులతో మాట్లాడి పనులు చేయించాలి. అయితే ఇక్కడి అధికారులు పురపాలకులను లెక్క చేయడం లేదు. వారు ఎన్డీయే కూటమి నాయకులు చెప్పినట్లే నడుచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బంది కూడా సహాయ సహకారాలు అందించకపోవడంతో పాలకులు విసుగు చెందుతున్నారు. ఇటు ప్రజలకు సమాధానం చెప్పలేని దుస్థితి ఏర్పడిందని పాలకవర్గ చైర్‌పర్సన్, పాలకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


డంపింగ్ యార్డు వద్ద రోడ్డు పైకి వస్తున్న చెత్త


రామలక్ష్మి వీవర్స్ కాలనీ సమీపంలో చెత్త

కౌన్సిల్‌లో బలం లేక.. పొమ్మనకుండా పొగ

మున్సిపాలిటీలో 23 మంది కౌన్సిలర్లకు 21 మంది కౌన్సిలర్లను వైఎస్సార్ సీపీ గెలుచుకుంది. వీరిలో ఒకరు మరణించగా ఇద్దరు టీడీపీలో చేరారు. దీంతో వైఎస్సార్ సీపీకి 18 మంది ఉన్నారు. జనసేన ఒకరు, టీడీపీ ఒకరు ఉండగా ఆ ఇద్దరితో ఎన్డీఏ కూటమి సంఖ్య నాలుగుకు చేరింది. టీడీపీ కౌన్సిలర్ అనారోగ్యంతో మరణించడంతో వారి బలం మూడుకు పడిపోయింది. తిరువూరు మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ ఎంత బలం ఉందో పెడనలో కూడా అంతే బలం ఉంది. అయితే అక్కడ చక్రం తిప్పినట్లు ఇక్కడ పరిస్థితులు అనుకూలించకపోవడంతో అధికారులను, సిబ్బందిని అడ్డం పెట్టుకుని పురపాలకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, సిబ్బంది సహకరించడం లేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా బుట్టదాఖలవుతున్నాయని మున్సిపాలిటీ పాలకులే పేర్కొనడం విశేషం. అధికారులు కూటమి నేతల కనుసన్నల్లోనే పని చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

పేరుకే స్వచ్ఛాంధ్ర



స్వచ్ఛాంధ్రా.. స్వచ్ఛ భారత్ పేరుకే. క్షేత్రస్థాయిలో ఎక్కడి చెత్త నిల్వలు అక్కడే ఉంటున్నాయి. నిత్యం చెత్త సేకరణ చేయాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు, సిబ్బంది అడుగులు ముందుకు వేయడం లేదు. ఫిర్యాదు చేస్తున్నా అధికారులు సహకరించడం లేదు. డంపింగ్ యార్డులో చెత్త రోడ్డుపైకి వస్తోందని, రాకుండా చూడాలని అధికారులకు, సిబ్బందికి చెప్పినా పరిస్థితి చక్కబడటం లేదు. అంతకు ముందు పనిచేసిన వెంకట్రామయ్య పారిశుద్ధ్యం విషయంలో పరుగులు పెట్టించారు. ఇదే సిబ్బంది ఉన్నారు. మరి ఎందుకు పనిచేయడం లేదు. కౌన్సిల్ సమావేశాల్లో హెచ్చరించినా మార్పు రాలేదు. అధికారులు సహకరించకుండా పొగపెడుతున్నారు.

–కటకం ప్రసాద్, కౌన్సిలర్, పెడన

సిబ్బంది తక్కువ



పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బంది తక్కువగా ఉన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. వయస్సు మళ్లిన వారున్నారు. ఇద్దరు మరణించారు. ఒకరు రిటైర్డ్ అయ్యారు. వీరంతా కాంట్రాక్టు వర్కర్లే. అయితే వీరిని తీసుకోవడానికి కూడా గతంలో మాదిరి తీసుకునే పరిస్థితి లేదు. సిబ్బంది తక్కువగా ఉండటంతో పాలకులు చెప్పిన చోటుకు వెళ్లడానికి ఆలస్యమవుతోంది. ఒక్కోసారి అధికారులు కేటాయించిన పనులు పూర్తి చేసేసరికి సమయం అయిపోతుంది. విషయాన్ని ఉన్నతాధికారులకు, పురపాలకులకు తెలియజేస్తూనే ఉన్నాం.

–హరికిషోర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, పెడన

ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు



పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. ఫిర్యాదు చేస్తున్నా స్పందించడం లేదు. పురప్రజలు మమ్మల్ని అడుగుతున్నారు. వారికి కచ్చితమైన సమాధానం కూడా ఇవ్వలేని పరిస్థితిని స్థానిక అధికారులు కల్పిస్తున్నారు. చెత్తను క్లియర్ చేయాలని చెబుతుంటే ఇదిగో అదిగో అంటూ దాట వేస్తున్నారు. సిబ్బంది కూడా రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అధికారుల తీరు ఏం బాగోలేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశాం. వారు కూడా స్పందించడం లేదు. పురప్రజలు అర్థం చేసుకోవాలని కోరుతున్నాం.

–కటకం నాగకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్, పెడన

దారుణంగా పరిస్థితులు



పురప్రజలు మమ్మల్ని గెలిపించి అధికారం కట్టబెట్టారు. అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యలు ఏమైనా ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేస్తాం. ప్రస్తుతం పట్టణంలో ఆ పరిస్థితి లేదు. ప్రజలు మాకు చెప్పడం, మేం అధికారులకు, కింది స్థాయి సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లడం వరకే. ఆ సమస్య పరిష్కారం కావడం లేదు. మా పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల ఫిర్యాదులను పట్టించుకుంటారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

–పిచ్చిక సతీష్‌బాబు, 22వ వార్డు కౌన్సిలర్, పెడన

క్లుప్తంగా

ప్రశాంతంగా మెగా డీఎస్సీ పరీక్ష



పెడన: నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారమేష్, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 181 మందికి 150 మంది హాజరయ్యారని, 31 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని వారు పేర్కొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోండి

లంకపల్లి(ఘంటసాల): వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్ తెలిపారు. లంకపల్లి రైతు సేవా కేంద్రంలో ఘంటసాల కేవీకే, మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. శాస్త్రవేత్త నవీన్ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించి ఎరువులు వాడితే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు. మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ, సర్పంచ్ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, డాక్టర్ పద్మావతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

భావదేవరపల్లి(నాగాయలంక): కృష్ణా జిల్లా సీనియర్స్ సిటిజన్ ఫోరం, సమరసత సేవా ఫౌండేషన్, బాలాజీ సేవాసంస్థ ఆధ్వర్యాన మండలంలోని భావదేవరపల్లిలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 300మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చారు. విజయవాడలోని షైన్ హాస్పిటల్స్, విజన్ కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని తొలుత మండలి వెంకట్రామ్, జిల్లా ధర్మప్రచారక్ మహిళా కన్వీనర్ నగరాజకుమారి ప్రారంభించారు. నిర్వాహక ప్రతినిధులు బచ్చు రామాంజనేయులు, పూషడపు నిరంజనరావు, కృష్ణా జిల్లా ధర్మప్రచారక్ ఆళ్ల జయశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఘంటసాల: ఘంటసాలలోని శ్రీజలధీశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మించిన శ్రీ కృష్ణ ద్వారక ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై శ్రీ కృష్ణ పరమాత్ముని మూల విగ్రహం, ఉత్సవ విగ్రహం, తీన్మార్ వాయిద్యాల నడుమ డీజే పాటలతో నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు.

ప్రతిభా అవార్డు విజేతలకు అభినందన



అవనిగడ్డ: ప్రతిభా అవార్డులకు ఎంపికైన ఇద్దరు ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థినిలను కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు శుక్రవారం అభినందించారు. ప్రతిభా అవార్డుకు ఎంపికైన కుప్పా పావని, బేగ్ హుమేరా కౌసబ్ సీఈసీలో జిల్లాలో ప్రథమ స్థానం సాధించడంతో ఇంటర్ బోర్డు ఈ ఇద్దరినీ ప్రతిభా అవార్డులకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా వీరిద్దరికీ కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు అంబేడ్కర్, వివేకానంద చిత్రపటాలను అందించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ మేరకు వీరికి ఈనెల 9న మచిలీపట్నంలో కలెక్టర్ బాలాజీ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు, రూ.20వేలు నగదు పురస్కారాలను అందుకోనున్నట్లు కరస్పాండెంట్ ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

పెడన: పట్టణంలోని బొడ్డునాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెల రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. సుమారు 50 జట్లు పాల్గొన్న టోర్నమెంటులో ఫైనల్ మ్యాచ్ సీఎస్‌కే చిట్టిపాలెం, డీటీపాలెం సోల్జర్స్ టీంల మధ్య జరిగింది. సీఎస్‌కే చిట్టిపాలెం టీం విన్నర్స్(ప్రథమ బహుమతి)గా నిలువగా డిటీపాలెం సోల్జర్స్ (ద్వితీయ బహుమతి) రన్నర్స్‌గా నిలిచింది. 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు నగదు బహుమతులను, ట్రోఫీలను అందజేశారు.

సుఖసంతోషాలతో జీవించాలి

కోనేరుసెంటర్: జిల్లాలోని ముస్లిం కుటుంబాలకు కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమైక్యతను, సమానత్వాన్ని పెంపొందిస్తూ త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ ప్రతి కుటుంబంలోనూ సుఖసంతోషాలు నింపాలని అల్లాను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతవరణంలో కుటుంబ సభ్యుల నడుమ ఆనందంగా జరుపుకుంటారని కాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం



మచిలీపట్నంటౌన్: నగరంలోని పోర్టు రోడ్డులో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏప్రిల్ 28వ తేదీ నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ శిబిరంలో విద్యార్థులకు కథలు చెప్పటంతో పాటు పలు పుస్తకాలను చదివించారు. స్పోకెన్ ఇంగ్లిషు నేర్పించి పలు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ యోగాసనాలు చేయించారు. చెస్, ఖోఖో వంటి ఆటలు ఆడించారు. ఆటల, వ్యాస రచన, క్విజ్, జనరల్ నాలెడ్జ్, సంప్రదాయ వస్త్ర ధారణ, మెహిందీ, పాటలు, శ్లోకాలు, చేతిరాత మెరుగుదల వంటి పోటీలు నిర్వహించారు. శుక్రవారం గ్రంథాలయంలో జరిగిన శిబిర ముగింపు కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్ ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఉపగ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లకు 10మంది అర్హత

నాగాయలంక: ఆర్థికంగా వెనకబడిన, ప్రతిభగల విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు మండలంలోని ఐదు పాఠశాలలకు చెందిన 10 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరికి నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారని ఎంఈఓలు టీవీఎం రామదాసు, అన్నపరెడ్డి రామారావు శుక్రవారం తెలిపారు. అర్హత సాధించిన వారిలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు ఎస్.మేఘన, పి.రితిక, జి.లలిత, కమ్మనమోలు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు నాగులపాటి వెంకట నాగ ప్రవంతి, దుమ్ము ప్రణీత, పానమాల సౌజన్య, నాలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నుంచి విశ్వనాథపల్లి వర్షిత, దండిప్రోలు యువరాజు, ఎస్.హర్షవర్ధన్ (నంగేగడ్డ), పి.మోహనరూప(భావదేవరపల్లి)ఉన్నారు.

కనులపండువగా..


ఆలయం వద్ద జరుగుతున్న హోమం

చల్లపల్లి: చల్లపల్లి మండలం పురిటిగడ్డ గ్రామంలో నిర్వహించిన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఈనెల 4వ తేదీ నుంచి జరుగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ కనిపించింది. శుక్రవారం ఉదయం 9.37 గంటలకు యంత్ర స్థాపన, ఆలయంపై శిఖర ప్రతిష్ఠ, దండ విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చల్లపల్లి ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. పురిటిగడ్డ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెజవాడ వరప్రసాద్, సెక్రటరీ గోళ్ల వెంకట శివసుబ్బారావు, ట్రెజరర్ భృగుమళ్ల దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్ దేసు లక్ష్మీకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు ఉద్యోగాలు కల్పించండి

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయ ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ విధానాన్ని పాటించకుండా బీసీలకు అన్యాయం చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం అన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు నూటికి 25% తో పాటు జనరల్ కోటాలో మరికొన్ని ఉద్యోగాలు రోస్టర్ విధానాన్ని అమలుచేసి ఇవ్వాలని కోరారు. యూనివర్సిటీలో 110 నాన్ టీచింగ్, ఒప్పంద, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు కేవలం 16 మంది బీసీలు మాత్రమే ఉద్యోగాల్లో ఉండటాన్ని గుర్తించాలని కోరారు. చట్టబద్ధంగా బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లను అమలుపరచాలని కోరారు. రోస్టర్ విధానాన్ని అమలుచేయకపోతే సంఘం తరపున బీసీలకు అండగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ మేరకు శుక్రవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కోన రాంజీకి సంఘం తరపున వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. వీసీని కలిసిన వారిలో కోమటి శ్రీను, చేబోయిన కోటేశ్వరరావు, ఎం. పవన్, పెద్దిబోయిన సాంబ, ఎన్. బాలాజీ తదితరులు ఉన్నారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అష్టోతర శతకలశ క్షీరాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేసి, కలశాలలోని జలాలతో మూలమూర్తులకు అభిషేకాలు చేశారు. రాత్రికి ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలకు అంకుర్పారణ చేశారు. ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి తొలిపూజలు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ధ్వజారోహణ చేసి సంతానం కోరే మహిళలకు గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు ఏర్పాటు చేసిన సప్తద్వారాల సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టీటీడీ ప్రచార కమిటీ మాజీ సభ్యుడు మొవ్వ రఘుశేఖరప్రసాద్, కోట సంపత్ కుమార్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో ప్రముఖులు


స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

మోపిదేవి: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీ ప్రభావతి, ప్రో కబడ్డీ బెంగుళూరు బుల్స్ తరఫున ఎంపికైన కిరాటి శివతేజస్(రవి) ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారి పుట్టలో పాలుపోశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బుద్ధుపవన్‌కుమార్ శర్మ ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటాలు, లడ్డూ ప్రసాదాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ నేతలు లింగం జగదీష్‌కుమార్, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, రామ్మోహనరావు పాల్గొన్నారు.

సందడిగా మసులా బీచ్ ఫెస్టివల్


అలరించిన నృత్య ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: మంగినపూడి బీచ్‌లో జరుగుతున్న మసులా బీచ్ ఫెస్టివల్-2025 లో భాగంగా ఏర్పాటు చేసిన హెలీ రైడ్స్‌ను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీతో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఫెస్టివల్ ఈ నెల 8వ తేదీ ఆదివారం వరకు నిర్వహిస్తారు. మంగినపూడి బీచ్‌లో ఏర్పాటు చేసిన మసుల బీచ్ ఫెస్టివల్‌లో వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన తినుబండారాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మచిలీపట్నంటౌన్: మంగినపూడి బీచ్ వద్ద జరుగుతున్న మసులా ఫెస్టులో భాగంగా ఏర్పాటు చేసిన వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కోలాట భజనలు, చిట్టూర్పుకు చెందిన నాంచారయ్య బృందం డప్పు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్రదర్శనలు అలరించాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెడన: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో 33/11కేవీ చేవేంద్ర సబ్‌స్టేషన్ పరిధిలోని చెన్నూరు ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ డీఈ గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అవనిగడ్డ: నాగాయలంక రోడ్డులోని 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట, రామకోటిపురం, తిప్పపాలెం, అవనిగడ్డ 3వ వార్డులో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: ఫ్రెండ్స్ ఫ్రంట్ సర్కిల్ నిర్వాహకుడు రావులపాటి శేషగిరిరావు ఆధ్వర్యాన శుక్రవారం ఈడేపల్లిలోని జెట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధులు, వికలాంగుల ఆశ్రమంలో నిత్యవసర వస్తువులను అందజేశారు. ఫ్రెండ్స్ ఫ్రంట్ సర్కిల్ 28వ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ సభ్యుల సహకారంతో 50 మంది వృద్ధులు, వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పాలాభిషేకం

చల్లపల్లి: చల్లపల్లిలో ఆర్యవైశ్య ప్రముఖులు శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పటం హర్షణీయమన్నారు. ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం చల్లపల్లి మండల అధ్యక్షులు బొగ్గవరపు శ్రీనివాసరావు, తమ్మన సతీష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక భరోసా


విద్యార్థినికి నగదు అందజేస్తున్న మైత్రి ఫౌండేషన్ సభ్యులు

మచిలీపట్నంటౌన్: మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన నాంపల్లి మహాలక్ష్మి అనే పేద విద్యార్థినికి రెండో విడతగా శుక్రవారం రూ.19 వేల ఆర్థిక సాయాన్ని ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. స్థానిక భాస్కరపురానికి చెందిన నాంపల్లి విజయ్‌కుమార్, వాహిని దంపతుల కుమార్తె మహాలక్ష్మి ఇటీవల ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 950 అత్యుత్తమ మార్కులు సాధించింది. చార్టెడ్ అకౌంటెంట్ చదవాలనే కలను నిజం చేసుకోవడానికి ఆర్థిక సాయం చేసే దాతల కోసం ఎదురుచూస్తూ మైత్రీ ఫౌండేషన్ గౌరవ సభ్యులు చదలవాడ దివాకర్ (కెనడా)ను సంప్రదించగా స్పందించిన ఆయన గుంటూరు మాస్టర్ మైండ్స్ అకాడమీలో చేరడానికి గతంతో ఆర్థిక సాయాన్ని అందించారని ఫౌండేషన్ అధ్యక్షుడు కె. వేణుకుమార్ తెలిపారు. తిరిగి రెండో విడత రూ.19 వేల ఆర్థిక సాయాన్ని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాలక్ష్మికి అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సౌత్, నార్త్ మండల పార్టీ కమిటీల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మచిలీపట్నం రూరల్ నార్త్, సౌత్ మండల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం రూరల్ నార్త్ మండలం కమిటీలో ఉపాధ్యక్షులుగా మందా బాబురావు, చందన మస్తాన్‌రావు, బత్రాజు వాకాలయ్య, బలగం వీరరాఘవయ్య, నట్టే ప్రసాద్‌ను నియమించారు. జనరల్ సెక్రటరీలుగా కోమట్ల నరసింహమూర్తి రెడ్డి, గాజుల నాగరాజు, చండిక అజయ్‌బాబు, శిరివెళ్ల బలరాం, చిలంకుర్తి ఏడుకొండలు, బలగం మస్తాన్‌బాబు, వర్రె మణిలను నియమించారు. కార్యదర్శులుగా 8 మందిని, సంయుక్త కార్యదర్శులుగా 9 మందిని నియమించారు.

సౌత్ మండల కమిటీ

మచిలీపట్నం రూరల్ సౌత్ మండల్ పార్టీ కమిటీలో ఉపాధ్యక్షులుగా చోరగుడి రామచంద్రరావు, మట్టా రాందాసు, జడ్డు గోగులు, తమ్మన మురళీ, అర్జా రమణ, చర్ల రమాదేవి, వడుగు అచ్యుతరామయ్యలను నియమించారు. జనరల్ సెక్రటరీలుగా మురారి కోటిలింగేశ్వరరావు, అంగడాల ఫణికుమార్, కోరేపల్లి రామస్వామి, వడుగు వెంకటనారాయణ, మొవ్వ వెంకయ్య, మోగంటి జనార్ధనరావు, మోకా ప్రసాద్, బండి దేవానందంలను నియమించారు. కార్యదర్శులుగా ఏడుగురిని, జాయింట్ సెక్రటరీలుగా ఐదుగురిని నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్థల పరిశీలన

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపం ప్రాంగణంలో ఇంకుడు గుంతకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యనారాయణ స్థల పరిశీలన చేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్‌తో కలసి చర్చించారు. కార్యక్రమంలో జేఈ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధి కూలీలకు ఆరోగ్యంపై అవగాహన

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డలో ఉపాధి కూలీలకు ఆరోగ్య జాగ్రత్తలపై సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. పంచాయతీ పరిధిలో పలుచోట్ల చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించిన ఆయన తడి, పొడిచెత్త, పారిశుద్ధ్యంపై తీసుకోవల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యవ్రతాలు

అవనిగడ్డ: లక్ష్మీ నారాయణస్వామి ఆలయం ఆస్థాన మండపంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు కావల్సిన పూజా సామగ్రిని ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, అన్నపూర్ణ దంపతులు ఉచితంగా అందించారు. అర్చకులు దీవి నరసింహమూర్తి, పవన్‌కుమార్ సత్యవ్రతాల పూజా కార్యక్రమాలు చేశారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

టేకుపల్లిలో రామేశ్వరస్వామికి అభిషేకాలు

మోపిదేవి: టేకుపల్లి రామేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శుక్రవారం అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేశారు

'యూజీ వన్‌టైమ్' పరీక్షల నోటిఫికేషన్ విడుదల

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలకు సంబంధించి యూజీ ఐదు, ఆరవ సెమిస్టర్ స్పెషల్ సప్లమెంటరీ, యూజీ వన్‌టైమ్ ఆపర్చ్యూనిటీ పరీక్షల నోటిఫికేషన్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాంజీ శుక్రవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ వీరబ్రహ్మచారి తెలిపారు. ఈ పరీక్షల ఫీజు చెల్లించడానికి రూ. 200 అపరాధ రుసుంతో ఈ నెల 10వ తేదీలోపు, రూ. 1000 అపరాధ రుసుంతో 13వ తేదీలోగా, రూ. 3000 రుసుముతో 16వ తేదీలపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేఆర్‌యు.ఏసీ.ఇన్) పరిశీలించాలని తెలిపారు.